







# శ్రీ ఆది బసవేశ్వర ఆలయం లో అఘోర పాశుపత రుద్ర హోమం

ప్రజాస్వరం , హైదరాబాద్ :
శ్రావణ మాసపు చివరి సోమవారం పురస్కరించుకుని శ్రీ ఆది బసవేశ్వర స్వామి దేవాలయం (బోర్లమ్) నందు పరమపూజ్య శ్రీ సద్గురు సోమలింగ శివాచార్య మహా స్వామీజీ గారి దివ్య ఆశీస్సులతో అఘోర పాశుపత రుద్ర హోమం, మహా పూర్ణాహుతి, మరియు ఆదిబసవేశ్వర స్వామి వారి పల్లకి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భాగ్యశ్రీ షాపింగ్ మాల్ (బాన్సువాడ) మరియు బోరంచ సమస్త గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, జాతర మహోత్సవంలో మహా అన్నప్రసాద వితరణ గావించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ శ్రీ ఆది బసవేశ్వర స్వామి వారి దివ్య కృపాకటాక్షాలు, భోళాశంకరుని ఆశీస్సులు మీ కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు మరియు ఈ ధర్మ కార్యంలో పాల్గొన్న భక్తులందరికీ ఎల్లవేళలా కలగాలని, ప్రతి ఒక్కరి ఇంట ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని నిర్వాహకులన్నారు.




















# బిజెపి అధ్యక్షురాలు లీలావతి బయానంద్ ముందస్తు అరెస్ట్

శంకర్‌పల్లి సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో శంకర్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్‌ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో పాటు విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు కోరుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన లీలావతి బయానంద్ను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరసనలను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.



# అటవీ శాఖ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం...

- అటవీ శాఖ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం...

మెదక్ సెప్టెంబర్ 07 (ప్రజా)

అటవీ శాఖ అధికారుల వేధింపులు తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించిన ఘటన మెదక్ మండలం పాతూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బస్సా పోచయ్య (55) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో శ్రీమంతం కార్యక్రమం ఉండటంతో వంట చెరకు కోసం పోచయ్య అడవికి వెళ్లాడు. ఈ సమయంలో ఆయన వెంట వెళ్లిన కుక్క అడవిలో ఉడుము పిల్లను పసిగట్టినట్లు వారు తెలిపారు. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు తెలియడంతో పోచయ్య, ఆయన కుమారుడిని అధికారులు విచారణ పేరుతో అదుపులోకి తీసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అధికారులు తండ్రి, కుమారుడిని మూడు రోజుల పాటు కొట్టి హింసించారని, తీవ్రంగా వేధించారని వారు ఆరోపించారు. అనంతరం పోచయ్యను మళ్లీ అటవీ శాఖ కార్యాలయానికి రావాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. ఇప్పటికే అధికారుల చేతిలో దెబ్బలు తిన్న పోచయ్య, మళ్లీ కార్యాలయానికి వెళ్తే తనను కొడతారనే భయంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు బంధువులు పేర్కొన్నారు. ఈ క్రమంలో రాత్రి సమయంలో పోచయ్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు ఈ విధంగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన.......**

పోచయ్య మృతికి కారణమైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న అటవీ శాఖ బీట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పోచయ్య మృతి పై నిజా నిజాలను వెలికి తీసేందుకు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారుల వేధింపుల కారణంగానే పోచయ్య మృతి చెందాడన్న ఆరోపణలపై అధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999